# పాపం కామేశం!

## -ఎ.వి.నర్సింహారావు

అది జనవరి నెల.

ఏడుగంటల సమయం.

మంచు కురవడం మొదలయి గంట దాటింది. చీకట్లు ఆ ఊరునంతా ఆక్రమించుకున్నాయి. అక్కడక్కడా వెలుగుతున్న వీధిదీపాలు, పెద్దగా నరసంచారం లేదు.

ఊరికి దూరంగా ఒకపక్కగా వున్న ఒంటరి ఇల్లు. ఒకవ్యక్తి అటుగా వచ్చి క్రీనీడలో తలదాచుకుంటూ ఇంటిచుట్టూ రెండు మూడుసార్లు తిరిగి, మెల్లగా తాళం కప్ప వేలాడుతున్న గుమ్మం దగ్గిర ఒక క్షణం ఆగి, తన ప్యాంటు జేబులోనుంచి తాళం చెవుల గుత్తిలో తీసిన తాళంతో ఆ తాళం కప్పను తెరిచి లోపలికి వెళ్లి తలుపులు మూసి గట్టిగా గాలి పీల్చుకున్నాడు. లోపల అంతా చీకటి. హాల్లోని బెడ్‌లైట్ తప్ప మరే వెలుతురూ లేదు. ఈ మసక చీకటిలో మరోసారి ఆ హాలంతా పరిశీలించి చూశాడా అగంతకుడు. చిందర వందరగా పడేసిన వస్తువుల్తో నిలబడేందుకు చోటు లేనట్టుంది ఆ హాలు. మెల్లగా హాలు దాటి బెడ్‌రూమ్‌లోకీ, తర్వాత మరోగదిలోకి వెళ్లి అన్నిటినీ పరిశీలనగా చూశాడు. పరిస్థితి అర్థమయింది. ఎవరో ఆ ఇంటిలోకి కొత్తగా ప్రవేశించినట్టు ఉంది. లేదా ఇల్లు ఖాళీ చేసి వెళ్లేందుకు సామాన్లు సిద్ధం చేసుకుని ఉండాలి...

అంతే-

మరోక్షణం ఆలస్యం చేయలేదు. దగ్గరున్న బట్టల మూటనుండి తనకు కావలసిన లుంగీ తీసి కట్టుకుని, ప్యాంటు చొక్కా విప్పి హ్యాంగరుకు తగిలించి బాత్రూంలోని చల్లని నీటితో ముఖం కడుక్కుని పది నిముషాలు సేదతీరాడు. కొంత టెన్షన్ తక్కువయింది. ముందు హాలులోకి వచ్చి అలమరాను తీసి ఒక్కొక్క వస్తువును పరిశీలిస్తూ తనకు కావాల్సిన వస్తువులను పక్కన పెట్టసాగాడు.

'టక్... టక్... టక్...' తలుపులపై శబ్దం.

ఉలిక్కిపడ్డాడు అగంతకుడు.

''సార్... సార్...'' ఎవరో పిలుస్తున్న శబ్దం. గుండెల్లో రాయి పడ్డట్టయింది. అయినా ధైర్యం కూడగట్టుకుని గుమ్మం దగ్గరకు వచ్చి నిలబడ్డాడు.

''సార్... సార్... ఒక్కసారి తలుపు తీయండి. నేను ఈ ఊరి పెదకాపును.''

''సరే, వస్తున్నా'' అని తలుపులు తెరిచాడు అగంతకుడు.

''సార్, క్షమించండి. మీకు ఈ రాత్రి శ్రమ ఇచ్చినందుకు. కానీ తప్పలేదు. ఈ ఊరిలో మీ ఇంట్లో తప్ప ఫోన్ సౌకర్యం ఎవరి దగ్గరా లేదు. ఒక్కసారి స్టేషన్‌కు ఫోన్ చేయాలి. అందువల్ల'' అంటూ నసిగాడు పెదకాపు.

ఆ ఇంట్లో ఫోన్ వున్న విషయాన్ని అంతవరకు గమనించని అగంతకుడు ఒక్కసారి హాలంతా కలయజూశాడు. దూరంగా మూలనున్న గూటిలో ఫోన్ కనబడింది.

''ఫోనా! స్టేషన్‌కా'' అంటూ నసిగాడు అగంతకుడు.

''అవును సార్- ఇవ్వాళ సాయంకాలం నుండి ఓ దొంగ వెధవ ఈవూరి వాడవాడనా తిరిగాడట. ఏ టైములో ఎవరి ఇంటిలో దొంగతనం చేస్తాడోనని ఊరంతా భయపడుతుంటే నేనే వారికి ధైర్యం చెప్పి పోలీస్ స్టేషన్‌కు ఫోన్‌చేసి వస్తానని ఇలా వచ్చాను. ఇవ్వాళే మీరు ఈ ఇంట్లోకి చేరడం మా అదృష్టం'' అంటూ మధ్యలో ఆపాడు పెదకాపు.

విషయం అర్థమయింది అగంతకునికి.

''సరే'' అంటూ ఫోన్‌వైపు చూపించాడు అగంతకుడు.

ఫోన్‌చేసి వెళ్తూ''మీరు జాగ్రత్త సార్ ఊరికి కొత్త, ఆ దొంగ వెధవ ఎప్పుడు ఎవరింటికి వస్తాడో, వాడి దగ్గర కత్తి ఉందట'' రహస్యం చెప్పినట్టుగా చెప్పాడు పెదకాపు.

''సర్లేండి'' ముక్తసరిగా జవాబు చెప్పాడు అగంతకుడు.

గుమ్మం దాకా వెళ్లి, ఒక్కనిమిషం ఆగి వెనక్కి వచ్చి ''నేను ఇల్లు సర్దడంలో మీకు సహాయం చేయాలా?'' అని అడిగాడు.

''అక్కర్లేదు, రేపు ఉదయం మా అక్కయ్యగారు, బావగారు వచ్చాక వారి ఇష్టప్రకారం నేను సర్దుతా లెండి. మీకు శ్రమెందుకు'' అన్నాడు అగంతకుడు.

''అయితే మీరు మా బ్యాంక్ మేనేజర్‌గారి బావమరిదన్న మాట. సర్లేండి. రేపు ఉదయం ఆరుగంటలకే పట్నం బస్సు వస్తుంది. బహుశా మీ బావగారు, అక్కగారు వస్తారేమో! వాళ్లను తీసుకొచ్చేందుకు నేను పెద్దరోడ్డు దగ్గరకు వస్తానులెండి.మరి. మీరు మాత్రం ఈ రాత్రికి జాగ్రత్తగా ఉండండి'' అంటూ జాగ్రత్తలు చెప్పి పోయాడు పెదకాపు.

రెండు క్షణాలు తనలో తాను నవ్వుకుని కార్యక్రమానికి దిగాడా అగంతకుడు. రెండు సూట్‌కేసుల నిండా తనకు కావలసినన్ని సర్దుకుని గడియారము కేసి చూశాడు. టైము రెండయింది. అయితే బస్సు ఆరుగంటలకుంది. 'అంతవరకూ రెస్టు తీసుకుందాం' అనుకుంటూ సోఫాలో వాలిపోయాడు.

'టక్... టక్' చప్పుడుకు మెలకువ వచ్చింది అగంతకుడికి. టైం చూసుకున్నాడు. తెల్లవారు జాము 5 గంటలు. ఉలిక్కిపడి లేచాడు. గుమ్మం దగ్గరకు వచ్చి-

''ఎవరు'' అంటూ అడిగాడు.

''నేను సార్, పెదకాపును. రాత్రి వచ్చి ఫోన్‌చేశాను గుర్తుందా?'' అని వినబడింది.

''ఓ... మీరా'' అంటూ తలుపులు తెరిచాడు అగంతకుడు.

'చెప్పండి' అన్నట్లు పెదకాపువైపు చూశాడు.

అతని వెంట ఇద్దరు పోలీసులు. గుండె జారిపోయింది అతనికి.

''సార్, రాత్రి నేను పోలీస్‌స్టేషన్‌కి ఫోన్ చేశాను కదా, వాళ్లు ఈ పోలీసులను మాకు సాయంగా పంపారు. మేమంతా కలిసి రాత్రంతా ఊరు కాపలా కాశాము. అది గమనించాడేమో ఆ దొంగ వెధవ, మా ఛాయలకే రాలేదు. మరి తెల్లవారిందికదా, ఒకసారి స్టేషన్‌కు ఫోన్‌చేసి తమ ఇండ్లకు వెళ్తామంటున్నారు పోలీసులు'' అంటూ తను వచ్చిన విషయం మెల్లగా తెల్పిచెప్పాడు పెదకాపు.

''ఆ... ఆ... సరే'' అని ఫోన్ చూపించి బెడ్‌రూమ్‌లోకి దూకాడు అగంతకుడు.

ఐదు నిమిషాల తర్వాత-

''మేము వెళ్తున్నాం సార్. పెద్దరోడ్డు దగ్గర కలుద్దాం'' అంటూ చెప్పిన పెద్దకాపు మాటలకు-

''సరే... అలాగే'' అంటూ బాత్రూంలోంచే సమాధానం చెప్పి, పదినిమిషాల్లో డ్రెస్ మార్చుకుని, రాత్రి సర్ది ఉంచిన రెండు సూట్‌కేసులను తీసుకుని బయటకు వచ్చి తలుపులకు తాళం కప్ప తగిలించి, ఒకసారి అటు ఇటు చూసి ముందుకు అడుగేశాడు.

• • •

దుమ్ము లేపుకుంటూ బస్సు వచ్చి ఆగింది పెద్దరోడ్డు స్టేజి దగ్గర. దాంట్లోంచి నలుగురయిదుగురు

దిగడం జరిగింది. అందులో ఆ వూరికి కొత్తగా వచ్చిన బ్యాంకు మేనేజర్ కామేశం, అతని భార్య దుర్గ వున్నారు. వాళ్లు పది అడుగులు వేయగానే పెదకాపు ఎదురయ్యాడు.

''నమస్కారం బాబు! ఇప్పుడే రావడమా. మీ బావమరిదిగారేరి?'' అని అడిగాడు.

మనసులో తన బావమరిది సంగతి ఇతడెందుకు అడిగినట్టు అనుకుంటూ ''అవును'' అని బదులిచ్చాడు కామేశం.

''మీరు ఊళ్లో లేకున్నా ఈ ఊరికి మంచి ఉపకారం చేశారు బాబు''

''నేనా'' ఆశ్చర్యంగా చూశాడు కామేశం.

''అదేనండి- మీరు ఇంట్లో లేకున్నా, మీ బావమరిదిని ఇంట్లో పెట్టడం వల్ల పెద్ద ముప్పు తప్పింది బాబూ.''

''మా బావమరిదేంటీ! ముప్పేంటీ?'' చిరాకుగా తల ముందుకు వంచి పెదకాపు ముఖంలోకి చూసి అడిగాడు కామేశం.

''అదేనండీ, నిన్న సాయంకాలం ఓ దొంగవెధవ పెద్దకత్తి తీసుకుని మన ఊళ్లో వున్న ఆసాముల ఇళ్లన్నీ పరిశీలించాడట దొంగతనం కోసం. అది గమనించి మేము మీ ఇంటికి వచ్చేసరికి మీ బావమరిది ఇంట్లో వున్నారు. వారి అనుమతితో పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేసి పోలీసులను పిలిపించి గస్తీ తిరిగాం. అది చూసి ఆ దొంగ వెధవ పారిపోయాడు. మళ్లీ మన ఊరి ఛాయలకే రాలేదంటే నమ్మండి. అదీ సంగతి!''

''అది సరేగానీ, మా ఇంట్లో మా బావమరిదేంటి?''

''అదేంటి, రాత్రి మీ ఇంట్లో కాపలా ఉంచింది మీ బావమరిదినేగా''

''ఎవరు చెప్పారు?''

''అతనే చెప్పాడు. మిమ్మలను రిసీవ్ చేసుకోడానికి వస్తానన్నాడే మీ బావమరిది!''

విషయం అర్థమయ్యేసరికి కుప్పకూలిపోయింది దుర్గ.

నిశ్చేష్టుడై చూస్తుండిపోయాడు పెదకాపు.

నోరెళ్ళబెట్టి అవాక్కైపోయాడు పాపం కామేశం!

★

